క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పల్లా చినతల్లి, తదితరులు

అక్కిరెడ్డిపాలెం/పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన పల్లా చినతల్లి శనివారం మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని, వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వ కర్త తిప్పల దేవన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే మిందిలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌ను కలిశారు. సమన్వయంతో పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా వారు సూచించారు. కార్యక్రమాల్లో నాయకులు రోజారాణి, కల్పన, లక్ష్మి, కనకలక్ష్మి, దుర్గమ్మ, లావణ్య, జిత్తు లక్ష్మి, ఈశ్వరి, స్వాతి, సూర్య, ఉమా, సోనీ బేగం, రామలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల అందజేత



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మస్తానప్ప ట్రస్టు ప్రతినిధులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు వై. మస్తానప్ప స్మారకంగా ఏర్పాటు చేసిన మస్తానప్ప మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు శనివారం మస్తానప్ప భార్య, మాజీ కౌన్సిలర్ వరలక్ష్మి వడ్లపూడి పాఠశాల విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు పెద్దలు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మస్తానప్ప ఎనలేని కృషి చేశారని కొనియాడారు. భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డ గోవింద్,చిత్రాడ వెంకటరమణ, గొందేశి అప్పలరెడ్డి, శ్రీకాంత్, బాలకృష్ణ, అప్పలరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల అందజేత



బాలింతలు, గర్భిణులకు ఆహారకిట్లు అందిస్తున్న లీ ఫార్మా డైరెక్టర్ లీలారాణి

అగనంపూడి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని లీఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీలారాణి అన్నారు. అగనంపూడి సీడబ్ల్యూసీ ఆవరణలో శనివారం కొండయ్యవలస, కర్రివానిపాలెం, పెదమడక అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహార నియమాలు పాటించాలని, అప్పుడే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కె.సరోజిని, పౌష్టికాహార నిపుణురాలు మాధురి, భాగ్యలత, లయన్స్‌క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ గుదే సుశీలా గజేంద్రరావు, వి.నాయుడు, బలిరెడ్డి గంగాదేవి, ఆకుల విజయకుమారి, జి.మంగ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి కుటుంబానికి సాయం



ఉద్యోగి భార్యకు సాయం అందజేస్తున్న డీజీఎం, సంఘం నాయకులు

ఉక్కునగరం: ఇటీవల మృతి చెందిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి కుటుంబానికి స్టీల్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆర్థిక సాయం అందజేసింది. స్టీల్ ఓబీసీ కార్యాలయంలో శనివారం స్టీల్ మెల్ట్ షాప్ ఉద్యోగి కె. చంద్రశేఖర్ భార్య శ్రీలక్ష్మికి రూ. 75 వేల చెక్ అందజేశారు. ఈ సందర్భంగా స్టీల్ మెల్ట్ షాప్ విభాగం అభివృద్ధికి చంద్రశేఖర్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విభాగం డీజీఎం కె. రాము, అసోసియేషన్ లైజన్ ఆఫీసర్ ఎస్. ఉమామహేశ్వరరావు, సంఘం అధ్యక్షుడు బి. అప్పారావు, కోశాధికారి శ్రీనివాస్, గెద్దాడ అప్పలరాజు, బి. కామేశ్వరరావు, నర్సింగరావు, వంగపండు సింహాచలం, ఎం.ఎన్. ప్రసాద్, ఆర్. సత్యనారాయణ, పూర్ణచంద్రరావు, పి.వి.ఆర్. నాయుడు పాల్గొన్నారు.



కోక్‌ఓవెన్స్ బ్యాటరీ



స్టీల్‌ప్లాంట్‌లో వినియోగించే సేఫ్టీ పరికరాలు



కోక్ డ్రై కూలింగ్ ప్లాంట్

ఉక్కు సమాహారం..

స్టీల్‌ప్లాంట్ విశేషాలు కళ్లకు కట్టేలా మ్యూజియంలో నమూనాలు

స్టీల్‌ప్లాంట్ ముఖ చిత్రం నుంచి ఉత్పత్తి వరకూ..

కరోనా నుంచి ప్లాంట్ సందర్శనకు బ్రేక్

SUNDAY SPECIAL



బ్లాస్ట్‌ఫర్నేస్ మోడల్

ఉక్కునగరం: రాష్ట్రంలో అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ స్టీల్‌ప్లాంట్. సుమారు 20 వేల ఎకరాల విస్తీర్ణంలో ఉంది. స్టీల్‌ప్లాంట్‌లో ముడి ఇనుప ఖనిజం నుంచి ఉక్కు ఉత్పత్తి ప్రక్రియ ఉంటుంది. అలాంటి ఘట్టాలను తిలకించడం ఉద్యోగులకే సాధ్యం కాదు. గతంలో సందర్శకులకు మాత్రం అవకాశం ఉండేది. కరోనా తర్వాత స్టీల్‌ప్లాంట్ సందర్శనను పూర్తిగా నిలిపివేశారు. ఈ నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ విశేషాలను తెలుసుకోవడానికి మ్యూజియం అద్దంలా నిలుస్తోంది.

ఉద్యమాల నుంచి ప్లాంట్ ఏర్పాటు వరకూ ...
దేశంలోని ఏ స్టీల్‌ప్లాంట్‌లో లేని విధంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రత్యేక మ్యూజియం నెలకొల్పింది. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు ప్రకటన, ఉద్యమాలు, శంకుస్థాపన నుంచి నేటి వరకు చరిత్రను మ్యూజియంలో ఏర్పాటు చేశారు. అదే విధంగా ప్లాంట్‌లోని పలు విభాగాల నమూనాలతో పాటు ఉత్పత్తి ప్రక్రియ, ఉక్కు ఉత్పత్తులు, భద్రతపై నమూనాలు, అవార్డు గ్యాలరీ, మోడల్ రూమ్ తదితర నమూనాలను పొందుపర్చారు.

లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో...
స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం సమీపంలోని లెర్నింగ్ అండ్ డెవలప్ మెంట్ సెంటర్ (ఎల్‌డీసీ)లో ఉక్కు మ్యూజియం ఏర్పాటు చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో చేరే ప్రతీ ఉద్యోగి, అప్రెంటిస్‌లు, ఇంటర్న్‌షిప్‌కు వచ్చే అభ్యర్థులంతా ఎల్‌డీసీలోనే ప్రాథమిక శిక్షణ పొందుతారు. మ్యూజియంను 2016 ఏప్రిల్ 01న నాటి కేంద్ర ఉక్కు కార్యదర్శి అరుణా సుందరరాజన్ ప్రారంభించారు.

ప్లాంట్ ఉత్పత్తుల గురించి...
స్టీల్‌ప్లాంట్‌లోని ఆయా భాగాల్లో ఏ ఉత్పత్తులు తయారవుతాయి.. అవి ఎందుకు ఉపయోగపడతాయన్న విషయాన్ని మ్యూజియంలో తెలియచెప్పారు. దేశంలో వినియోగదారుల అవసరాలకు తగ్గట్టుగా తయారు చేస్తున్న ఉత్పత్తులను చూపించారు.

అవార్డు గ్యాలరీ.. మోడల్ రూమ్..
స్టీల్‌ప్లాంట్ సాధించిన అవార్డులను అవార్డు గ్యాలరీలో ప్రతిబింబించారు. అదే విధంగా ఉద్యోగులు సాధించిన అవార్డులు, క్వాలిటీ సర్కిల్ అవార్డులు మ్యూజియంలో ఏర్పాటు చేశారు. స్టీల్‌ప్లాంట్ నమూనాను మోడల్ రూమ్‌లో ఏర్పాటు చేశారు.

మ్యూజియంను సందర్శించిన ప్రముఖులు..
స్టీల్‌ప్లాంట్ పర్యటనకు వచ్చే అనేక మంది ప్రముఖులు స్టీల్ మ్యూజియంను సందర్శించారు. నాటి కేంద్ర ఉక్కు మంత్రి చౌదరీ బీరేంద్ర సింగ్‌తో పాటు కేంద్ర కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు ఈ మ్యూజియంను చూసి ఆనందం వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ మ్యూజియం ఏర్పాటు చేశారని అధికారులను అభినందించారు.

ప్లాంట్ ఉద్యమ చరిత్ర...

మ్యూజియంలో ముఖ్యంగా చెప్పాల్సింది ప్లాంట్ ఉద్యమ చరిత్ర గురించి.. 1966లో నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తామని పార్లమెంట్‌లో ప్రకటించారు. తర్వాత కొన్ని కారణాల వల్ల ప్లాంట్‌ను కర్ణాటకలోని హోస్పేటకు తరలించాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. ఈ విషయం తెలిసిన ఆంధ్రులు ఉక్కు ఉద్యమం చేపట్టారు. అందులో 32 మంది ప్రాణత్యాగం చేశారు. ఈ పరిణామాలతో కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి 1971లో ప్రధాని ఇందిరా గాంధీ స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు.



స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి కోసం వినియోగించే ముడి పదార్థాలు

స్టీల్‌ప్లాంట్‌కు 19702 ఎకరాల సేకరణ

విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం ప్రభుత్వం 19702 ఎకరాల భూమిని సేకరించింది. ఇందులో 9 వేల ఎకరాల్లో ప్లాంట్ నిర్మాణం చేపట్టగా, 4875 ఎకరాల్లో టౌన్‌షిప్ నిర్మించారు. సుమారు 4866 ఎకరాల్లో గ్రీన్‌బెల్ట్, ప్లాంట్ రహదారుల కోసం 153 కిలో మీటర్లు, 225 ఎకరాల్లో పార్కులు, స్టేడియంలో పాటు వివిధ పాఠశాల లు, ఆలయాల కోసం భూమిని వినియోగించారు. వీటికి మ్యూజియంలో చోటు కల్పించారు.



కంటిన్యూస్ క్యాస్టింగ్ షాప్

మ్యూజియం సందర్శన గొప్ప అనుభూతి



దాదాపు స్టీల్‌ప్లాంట్ మొత్తాన్ని చూపేలా ఏర్పాటు చేసిన స్టీల్ మ్యూజియం చూడడం గొప్ప అనుభూతి కలిగిస్తుంది. ప్లాంట్‌లోని వివిధ విభాగాలతో పాటు అక్కడి ఉత్పత్తి ప్రక్రియను వివరించే ఈ మ్యూజియంను చూస్తే ప్లాంట్‌ను చూడాల్సిన అవసరం ఉండదు. మ్యూజియంకు అనేక ప్రశంసలు లభిస్తున్నాయి.

– టి.కె.ఎస్.ఆర్. ఠాగూర్,, జనరల్ మేనేజర్, ఎల్ అండ్ డీసీ అండ్ హెచ్‌ఆర్‌డీ, విశాఖ స్టీల్‌ప్లాంట్

ఆస్తి పన్ను బకాయిలపై దృష్టి

4,430 మందికి జప్తు నోటీసులు

గాజువాక: గాజువాక జోన్‌లో ఆస్తి పన్ను బకాయిల వసూళ్లపై జీవీఎంసీ రెవెన్యూ విభాగం అధికారులు దృష్టి సారించారు. మొండి బకాయిలను ముక్కు పిండైనా వసూలు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా గాజువాక జోన్‌లో 4,430 మందికి జప్తు నోటీసులను సిద్ధం చేశారు. చిన్న చిన్న బకాయిలు మినహాయిస్తే 4,430 మంది నుంచి జీవీఎంసీకి రూ.22 కోట్ల ఆస్తి పన్ను రావాల్సి ఉన్నట్టు గుర్తించిన అధికారులు వాటిని వసూలు చేయడానికి చర్యలు ప్రారంభించారు. ఈ మేరకు జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ గాజువాక జోనల్ రెవెన్యూ అధికారులు, సచివాలయ రెవెన్యూ కార్యదర్శులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఏ వార్డు నుంచి ఎంత బకాయి ఉంది, ఎంత కాలం నుంచి పెండింగ్‌లో ఉంది వంటి అంశాలను ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొండి బకాయిదారులందరికీ వెంటనే జప్తు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. జప్తు నోటీసులు అందజేసిన తర్వాత వారు ఎప్పటిలోగా పన్ను చెల్లిస్తారో కమిట్‌మెంట్ తీసుకోవాలన్నారు. వారు అడిగిన తేదీలోగా పన్ను చెల్లించకపోతే కుళాయిలను కట్ చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తి కావడానికి కేవలం నెల రోజుల సమయం ఉందని, వచ్చే నెల 15 లోగా బకాయిలను వసూలు చేయాలని ఆదేశించారు. ఆ తరువాత మరోసారి సమీక్ష నిర్వహిస్తానని చెప్పారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి, రెవెన్యూ అధికారి ఎం.శ్రీకాంత్, ఆర్‌ఐలు రెడ్డి మోహన్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

సమరయోధులకు నివాళి



స్వాతంత్య్ర సమరయోధుల చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెదగంట్యాడ: స్వాతంత్య్ర సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారావు, మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి వేడుకలను జీవీఎంసీ 77వ వార్డు చేపలపాలెం ప్రాథమిక పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్ర పటాలకు పాఠశాల హెచ్‌ఎం కూరపాటి వినోద్ కుమార్, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి పోరాటాలను విద్యార్థులకు వివరించారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న అతిథులు

అగనంపూడి : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ కుప్పిలి కీర్తి పట్నాయక్ అన్నారు. అగనంపూడిలోని విజ్ఞాన్ బ్రిలియంట్ పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. విద్యార్థి దశలో సృజనాత్మకత, వినూత్నంగా ఆలోచించడం, భావాలను వ్యక్తపర్చడానికి అవకాశం ఉందన్నారు. సాంకేతిక, విజ్ఞాన రంగంలో పట్టు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నెల్లి శ్రీనివాసరావు, బలిరెడ్డి సత్యనారాయణ, పాఠశాల కరస్పాండెంట్ కె.వి.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ కె.పద్మావతి, ఉక్కు గుర్తింపు యూనియన్ నాయకులు సాయిన సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ సర్వేక్షణ్

అదనపు కమిషనర్ సోమన్నారాయణ



పాల్గొన్న ప్రజారోగ్య, యూసీడీ విభాగాల సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ సోమన్నారాయణ

గాజువాక: ప్రజారోగ్య విభాగం సిబ్బంది స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ సూచించారు. గాజువాక జోన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులు, యూసీడీ విభాగం సిబ్బందితో జోనల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీవీఎంసీ ఉత్తమ ర్యాంకు సాధించే విధంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. దీనికోసం అన్ని వార్డుల్లో పారిశుధ్య నిర్వహణను సక్రమంగా చేయడంతో పాటు ప్రజల నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ యాప్‌లో అభిప్రాయ సేకరణ చేపట్టాలన్నారు. పారిశుధ్య నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ విషయంలో విమర్శలకు తావులేకుండా పని చేయాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో యూసీడీ విభాగం సిబ్బంది కూడా చురుగ్గా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి, సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు, యూసీడీ విభాగం సహాయ ప్రాజెక్టు డైరెక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి విశేష పూజలు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశుడికి శనివారం సుప్రభాత సేవ, తోమాల సేవను నిర్వహించారు. సాయంత్రం స్వామికి అర్చనలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరుడిని విశేష పుష్పాలతో అలంకరించారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

- బెంబే లెత్తిపోతున్న ప్రజలు
- అధికారుల తీరుపై మండిపాటు



ఆర్చికి సమీపంలో వేసిన టాన్స్‌ఫార్మర్

కూర్మన్నపాలెం: వడ్లపూడి, దువ్వాడలోని పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు సంకేతంగా ఉన్నాయి. ఇటీవల కాలంలో నిర్మించిన భవనాల వద్ద ఈ పరిస్థితి కనిపిస్తోంది.అయితే అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడ ఏర్పాటు చేసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు టాన్స్‌ఫార్మర్ బిగించి ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాల్సిన బాధ్యత ఉంది. అయితే ఆ విషయాన్ని దువ్వాడ, వడ్లపూడి సబ్‌స్టేషన్ అధికారులు గాలికి వదిలేసి పలుకుబడి కలిగిన పెద్దల సిఫారసులకు లొంగిపోతున్నారు. భవనాలకు వెలుపలే టాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇందుకు వడ్లపూడి డబుల్‌రోడ్డులో ఏడు గుళ్లకు సమీపంలో నిర్మించిన భవనం ముందు దర్శనమిస్తున్న టాన్స్‌ఫార్మరే నిదర్శనంగా చెప్పుకోవచ్చు. రహదారి పక్కనే ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆ రోడ్డుపై ప్రయాణం చేసే వాహన చోదకులు, ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు.

ఫిర్యాదు చేసినా..
అక్కడ టాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకముందే భవన యజమాని దిమ్మ నిర్మిస్తే దానిపై స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రణాళిక విభాగం సిబ్బంది ఆ దిమ్మను తొలగించేశారు. ఆ తర్వాత ఏమి జరిగిందో తెలియదుగాని అక్కడే దిమ్మకట్టి టాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు.
అలాగే రాజీవ్‌నగర్‌కు సమీపంలోని రాసాలమ్మకాలనీ వద్ద నిర్మించిన భారీ భవనం విషయంలో కూడా దువ్వాడ సబ్‌స్టేషన్ అధికారులు అలాగే నిర్లక్ష్యం చూపారు. కాలనీకి ముందుభాగంలో నిర్మించిన ఆర్చి దగ్గరలో టాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇది చూసిన వారు విద్యుత్‌శాఖ అధికారులు నిబంధనలకు తిలోధకాలు ఇచ్చేసి భవన యాజమానికి సానుకులంగా మారిపోయారని విమర్శిస్తున్నారు. ఇటువంటి చర్యల వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులు మండిపడుతున్నారు.

పరిశీలించి చర్యలు

ప్రజలకు ఇబ్బంది కలిగేలా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయకూడదు. యజమానులు రక్షణ చర్యలు తీసుకోవాలి.అలాంటి ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– వీర్రాజు, ఏఈ, వడ్లపూడి సబ్‌స్టేషన్

దేవన్‌రెడ్డిని కలిసిన కొయ్య భారతి



దేవన్‌రెడ్డికి చిత్ర పటం అందజేస్తున్న కొయ్య భారతి

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ మున్సిపల్ విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన కొయ్య భారతి శనివారం వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో గొందేశి మహేశ్వరరెడ్డి, మార్టుపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి, గొందేశి అప్పలరెడ్డి, గొందేశి పైడిరెడ్డి, పిట్టా రమణ, నీలాపు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు

అక్కిరెడ్డిపాలెం: పూర్వ ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీలకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ జయదేవి అన్నారు. జీవీఎంసీ 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంగన్‌వాడీలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను శనివారం ఆమె సందర్శించారు. విద్యార్థులను ఆకట్టుకునే రీతిలో బోధన ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారుల పుట్టినరోజు వేడుకలు నిర్వహించాలన్నారు. దానికి సంబంధించి డెమో నిర్వహించారు. అనంతరం టీచర్లకు స్టడీ మెటీరియల్ అందజేశారు.